క్లుప్తంగా

అద్దె భవనం.. మట్టి రోడ్డు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుంది. రోడ్డుకు కిలోమీటర్ దూరంలో మట్టి రోడ్డుపైనే ప్రయాణించి పాఠశాలకు చేరుకోవాలి. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మట్టి రోడ్డుపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. వెంటనే సీసీ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.

విద్యార్థి ప్రతిభ

గద్వాలన్యూటౌన్: స్థానిక కాకతీయ పాఠశాల విద్యార్థిని ఉల్ఫత్ జహన్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబర్చింది. సుచరి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ వారు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఒలంపియాడ్ పరీక్షలో పదో తరగతి చదువుతున్న ఉల్ఫత్ జహన్ జిల్లా మొదటి ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ జోషి, ప్రిన్సిపాల్ సీమ జేమ్స్, ఉపాధ్యాయ బృందం విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి శుక్రవారం కమిషనర్ రాజయ్య ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులతో పాటు సబ్బులు, కొబ్బరినూనె బాటిళ్లు అందజేశారు.

చింతరేవుల ఆలయంలో పూజలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘ శుద్ధ దశమి శుక్రవారం మధ్వ నవమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి అలంకరణ, సాయంత్రం పల్లకీ సేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ఆలయ ప్రధాన అర్చకులు కిష్టాచార్యులు, మధ్వాచార్యులు, ఈఓ కవిత పాల్గొన్నారు.

ఆలయంలో రాయచూర్ ఎమ్మెల్యే..

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాలను కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు.

రమాబాయికి ఘన నివాళి



అయిజ: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం వివిధ పార్టీలు, సంఘాల నాయకులు రమాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ అంబేడ్కర్ దంపతుల ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, విజయభాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, సుమజ, సుబ్బన్న, ప్రభాకర్, ప్రకాష్, యేసురాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ శివారులోని కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులకు తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వసంత ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 290 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాధులు దరి చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సబ్సిడీ ‘డ్రిప్పు’ అందేనా..?

- మూడేళ్ల క్రితం డీడీలు చెల్లించిన వైనం
- ఒక్కో రైతు రూ.10 వేల నుంచి రూ.1.2లక్షల వరకు చెల్లింపు
- నీరందక ఎండుతున్న పంటలు



జూలెకల్ శివారులో డ్రిప్ సౌకర్యం లేక ఎండుతున్న మొక్కజొన్న పంట

శాంతినగర్: నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు డ్రిప్ పైపులు అందకపోవడంతో పంటలకు నీటి తడులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తామని ఒక్కొక్క రైతుతో రూ.10 వేల నుంచి రూ.1.20లక్షల వరకు కట్టించుకున్నారు. కానీ మూడేళ్లయినా పరికరాలు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

150 మంది రైతుల నుంచి..

18 కంపెనీలకు చెందిన ప్రతినిధులు నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 150 మంది రైతుల నుంచి డ్రిప్ పరికరాల కోసం డీడీలు కట్టించుకున్నారు. అయిజ మండలంలోని యాపదిన్నె, వడ్డేపల్లి మండలంలోని కొంకల, జూలెకల్, ఇటిక్యాల మండలంలోని వావిలాల, సాతర్ల, రాజోళి మండలాల పరిధిలోని రైతులను డ్రిప్ కంపెనీ ఏజెంట్లు కలిశారు. డబ్బులు కట్టిన 15 రోజుల్లోనే డ్రిప్ పరికరాలు అందిస్తామని ఆశ చూపి పొలాల వద్దకే వెళ్లి రైతులతో ఫొటోలు దిగారు. కంపెనీని బట్టి రైతుల నుంచి ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.10,500 వేల చొప్పున గరిష్టంగా 12 ఎకరాల వరకు సుమారు రూ.1.2 లక్షల వరకు కట్టించుకున్నారు. డ్రిప్ పరికరాలు ఎప్పుడు వస్తాయని రైతులు ప్రశ్నించినా కంపెనీ ప్రతినిధులు మూడేళ్లుగా కాలయాపన చేస్తున్నాయని వాపోతున్నారు. అంతేగాక ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం ఉచితంగా డ్రిప్ పరికరాలు ఇస్తామని, కేవలం జీఎస్టీ చెల్లిస్తే చాలంటూ వారి వద్ద నుంచి కూడా ఎకరానికి రు.5 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేశారు.

పరికరాలు వెంటనే ఇవ్వాలి..



మా పొలంలో బోరు వేయించా. కానీ నీరు సమృద్ధిగా రాలేదు. దీంతో నాకున్న మూడెకరాలకు నీరు సరిపోవడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో మూడేళ్ల క్రితం డ్రిప్ పరికరాల కోసం రూ.18 వేలు చెల్లించాను. చేనుకు వచ్చి ఫొటోలు తీసుకుని వెళ్లారు. ఎప్పుడు ఫోన్ చేసినా సమాధానం దాటవేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి డ్రిప్ పరికరాలు వెంటనే అమర్చి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, యాపదిన్నె, అయిజ మండలం

పంట ఎండుతోంది



మూడేళ్ల క్రితం డ్రిప్పు పరికరాల కోసం కుమార్ కంపెనీ వారికి డబ్బులు కట్టాను. యాసంగి సీజన్‌లో పొలంలో మొక్కజొన్న సాగు చేశాను. ప్రస్తుతం మొక్కజొన్న చేను పొట్ట దశలో ఉంది. బోరు నుంచి ఇంచు నీరు వస్తుంది. వచ్చే కొద్దిపాటి నీటిని చాలు పాడవునా పొలానికి పారిస్తున్నాను. నీరు చాలడం లేదు. వెంటనే డ్రిప్ పరికరాలు అందించి పంట నష్టపోకుండా చూడాలి.

– కుర్వ కృష్ణ, యాపదిన్నె, అయిజ మండలం

మార్చిలోగా..

మూడేళ్ల క్రితం డ్రిప్ సౌకర్యం కల్పిస్తామని రైతుల నుంచి డబ్బులు తీసుకున్నాం. రైతుల నుంచి తీసుకున్న డబ్బులను డీడీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాం. అప్పట్లో కేవలం పామాయిల్ తోటలకే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పడంతో ఇతర పంటలకు సంబంధించి డ్రిప్ పరికరాలు నిలిపేశారు. ఇటీవల రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. గతంలో డీడీలు కట్టిన రైతులకు సంబంధించి మార్చిలోగా డ్రిప్ సౌకర్యం కల్పిస్తాం.

– కృష్ణ, కుమార్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి, గద్వాల

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

- లింగమయ్య, తులసి కట్ట, నవగ్రహ నాభిశిల విగ్రహాల ప్రతిష్ఠ



అలంపూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

అలంపూర్ రూరల్: పట్టణంలోని 8వ వార్డు న్యూప్లాట్స్ కాలనీలో అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం ధ్వజస్తంభాన్ని వేద పండితులు మంత్రోచ్ఛరణలతో ప్రతిష్ఠింపజేశారు. అలాగే ఉదయం నుంచి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధువుల రాకతో కాలనీలో సందడి నెలకొంది. అలాగే లింగమయ్య, తులసి కట్ట, నవగ్రహ నాభిశిల విగ్రహాల ప్రతిష్ఠలను కూడా చేశారు. అభయ ఆంజనేయస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో దాతల సహకారంతో వైభవంగా పూజ కార్యక్రమాలను చేపట్టారు. పూజల్లో దాతలు గంగరాజ్ ప్రసాద్, మహేశ్వర్‌గౌడ్, ఆంజనేయులు, ఈదన్న, వెంకటస్వామి, నిఖిలేష్‌రెడ్డి, స్వామి, నిర్వాహకులు వెంకటేశ్వర్లు, మద్దిలేటి, లక్ష్మన్న, లంకన్న, మల్లికార్జున్, తదితర భక్తులు, ఆంజనేయ బక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయం వద్ద..

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో బీరప్ప ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



బొంకూర్‌లో

ఈ సందర్భంగా కుర్వ సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివనారాయణస్వామి జాతర



రమాసత్యనారాయణస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్‌ఐ చంద్రకాంత్

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో శుక్రవారం బాలయోగి శివనారాయణ స్వామి జాతర సందర్భంగా ఉదయం 10:32 నిమిషాలకు రమాసహిత సత్యనారాయణ స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు జోగుళాంబ భజన బృందంచే సంకీర్తన, మధ్యాహ్నం 3 గంటలకు విశ్వహిందూ పరిషత్ జనహిత బృందం చేత కోలాటం కార్యక్రమాలు, కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదానం, తాగునీరు వసతులు కల్పించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

జాతరను పురస్కరించుకొని గ్రామంలో అంతరాష్ట్ర కబడ్డీ పోటీలను ఎస్‌ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసికోల్లాసం ఇస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని సూచించారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



పశు వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

రాజోళి: పాడి రంగంలో రైతులు కొద్దిపాటి మెలకువలు పాటిస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందని పశు సంవర్ధకశాఖ సిబ్బంది అన్నారు. పశువులకు వేసే మేత, తౌడు, దాన తదితర అంశాల్లో వైద్యాధికారుల సలహాలు తీసుకొని పాల దిగుబడి పెంచుకోవడంతో పాటు పశువులు అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవాలన్నారు. సరైన సమయంలో వ్యాధి, గర్భకోశ నివారణ టీకాలు వేయడం వల్ల సంబంధిత వ్యాధుల నుంచి కాపాడగలమని, వాటికి పుట్టబోయే దూడలు కూడా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లేష్, వీఎల్‌ఓ వరప్రసాద్, బుచ్చమ్మ, కార్తీక్, గోపాలమిత్రలు రాఘవేంద్ర, లక్ష్మన్న, భాస్కర్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: ఉండవెల్లి, అలంపూర్ చౌరస్తా, మారమునగాల సబ్‌స్టేషన్లతో పాటు 11కేవీ ఫీడర్లలో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా శనివారం ఆయన సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అలంపూర్ సబ్ డివిజనల్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బూల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

గట్టు: గట్టు సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ మెయింటెనెన్స్ పనుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ చెన్నయ్య, లైన్‌మెన్ భీమేష్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గట్టు, గంగిమాన్‌దొడ్డి, యల్లందొడ్డి, తారాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం పనులను శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భూమిపూజ చేశారు. మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, సంస్థానాధీశులు రాజశ్రీరాంభూపాల్ ముఖ్య అతిథులుగా హాజరై పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఇదివరకే అమ్మవారి విగ్రహ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో పూర్వక కలాపకర్షణ, ఉద్యాపన, గణపతిపూజ, హోమం, అభిషేకం తదితర పూజలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పెద్దమ్మతల్లి పునఃప్రతిష్ఠతో ఊరికి మంచి జరుగుతుందని నిర్వాహకులు అన్నారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దమ్మ గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు అవసరమని, భక్తులు విరాళాలు అందించి సహకరించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, మాజీ చైర్‌పర్సన్ గాయత్రి రవియాదవ్ దంపతులు, గాడి లక్ష్మీనారాయణ, వాస్తుపండితుడు రమాకాంత్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీను, బాలకృష్ణ, నాగేష్, సుదర్శన్‌శెట్టి, యాదగిరిశెట్టి, రవికుమార్, భక్తులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి

- ఇంటింటికీ తిరిగి పన్నుల వసూలు
- ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని సూచన



పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్ శశిధర్

ఆత్మకూర్: పట్టణ అభివృద్ధికి స్థానికులు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని మున్సిపాలిటీ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. శుక్రవారం వార్డు అధికారులు, పుర సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి పన్నులను చెల్లించాలని ఇంటి యజమానులకు సూచించారు. మున్సిపాలిటీలో రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయని, పన్నులు చెల్లిండంలో చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం రూ.2.46 లక్షల పన్నుల బకాయిలు వసూలు అయ్యాయని కమిషనర్ తెలిపారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

వ్యాపార సముదాయాల్లో ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. ఈసందర్భంగా దుకాణ సముదాయాల్లో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టి రూ.రెండువేల చొప్పున ఐదుగురు వ్యాపారస్తులకు జరిమానాలు విధించారు.

సమస్యలు తలెత్తకుండా చూడండి..

మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు తీర్చడంలో ముందుండి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవిబాబు శుక్రవారం అమరచింతకు వచ్చిన ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్య వ్యవహారాలను కాపాడేందుకు నిత్యం ఫాగింగ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యూసుఫ్, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మహంకాళి విష్ణు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరిగారి విష్ణు పాల్గొన్నారు.

పోషకాహారం లోపం అధిగమిద్దాం



గద్వాల (ధరూరు): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో పంచాయతీ కార్యదర్శులకు, ఐకేపీ సీసీలకు ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మంజుల, ఏపీఎం శోభారాణి మాట్లాడుతూ.. చిన్న పిల్లల్లో పౌష్టికాహార లోపం-నివారణ చర్యలపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కలిగే పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు జయరాజు, రాములు, నవీన్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

లారీని ఢీ కొట్టిన కారు



ఉండవెల్లి: కారు, వెనుక నుంచి లారీని ఢీకొట్టిన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై ఉండవెల్లి స్టేజీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. మైసూర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న లారీని వెనుక నుంచి బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న కారు ఢీ కొట్టింది. ఘటనలో కారు ముందు భాగం దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న ఒడిశాకు చెందిన శ్రీనివాసన్‌కు ఎలాంటి గాయాలు కాలేదని హైవే సిబ్బంది పేర్కొన్నారు. హైవే క్రేన్ సహాయంతో కారును రోడ్డు పక్కకు తరలించారు.

పశువుల సంతలో అధికారులపై దాడి

అయిజ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డులో గురువారం నిర్వహించిన పశువుల సంతలో పొటేళ్ల కొనుగోళ్ల విషయంలో అధికారులకు విక్రయదారులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈసందర్భంగా పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించారని, అధికారులపై దాడిచేశారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లోమార్కెట్ అధికారులు ఫిర్యాదు చేశారు. మార్కెట్ ఫీజు అడిగిన సెక్రెటరీ ఎల్లస్వామిపై, సిబ్బంది రాములపై అయిజ పట్టణానికి చెందిన నాగన్న, మహేష్, నరేందర్ మూకుమ్మడిగా దాడిచేశారని, దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారి తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



ఉమిత్యాలతండాలో సబ్జెక్ట్ మేళాను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కేటీదొడ్డి: విద్యార్థులతో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సబ్జెక్ట్ మేళా ఎంతో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం వినోద్ అన్నారు. బుధవారం మండలంలోని ఉమిత్యాలతండా పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన తెలుగు, ఇంగ్లిష్, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల వారీగా మూడో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రకరకాల టీఎల్‌ఎం మెటీరియల్‌ను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమానికి తల్లిదండ్రులు హాజరై మెటీరియల్‌ను తిలకించారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ పుష్పరాజ్, గ్రామ పెద్దలు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి ప్రహరీ నిర్మించాలి



ప్రహరీ లేని మల్దకల్ కస్తూర్బా గాంధీ పాఠశాల

మల్దకల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలకు పూర్తి స్థాయిలో ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు, మేకలు సంచరిస్తూ పాఠశాల పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల ఎదుట గద్వాల, అయిజ ప్రధాన రహదారి ఉండటంతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చే సమయంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయని, అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కేటీదొడ్డి: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని గువ్వలదిన్నెలో శుక్రవారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బ్యాంక్ ఖాతా వ్యక్తిగత వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని, ఫోన్లలో ఓటీపీ, పేటీఎం, గూగుల్‌పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని, వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపే వారు కొత్త వ్యక్తుల మాటలు నమ్మొద్దని తెలియని మేసేజ్‌లు క్లిక్ చేయకూడదన్నారు. కొత్త వ్యక్తులు గ్రామంలో అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బాల్యవివాహలు చేసిన ప్రోత్సాహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని, మహిళలను బాలికలను వేదిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాణ్యమైన బ్యాంకు సేవలు పొందాలి



మాట్లాడుతున్న పృథ్వీ

ఎర్రవల్లి: బ్యాంకు సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్‌బీఐ లీడ్ జిల్లా అధికారి పృథ్వీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్థిక అక్షరాస్యత కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్క ఖాతాదారుడు తప్పకుండా బీమా కలిగి ఉండాలన్నారు. బ్యాంకు ద్వారా సేవలు పొందాలనుకునే వారు నేరుగా బ్యాంక్ సిబ్బందిని సంప్రదించాలని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో యూబీఐ మేనేజర్ సురేష్‌కుమార్, సిబ్బంది భరత్, శేఖర్‌రెడ్డి, మధుకృష్ణ, రవిసాగర్, గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శాంతినగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంకల గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తి సొంత పని విషయమై సాయంత్రం శాంతినగర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామమైన కొంకలకు మోటార్ సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో అలంపూర్, రాయిచూర్ ప్రధాన రహదారిపై జూలెకల్ స్టేజీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో నారాయణ తలకు, చేతులకు రక్త గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108కు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.